క్లుప్తంగా

కనులపండువగా సత్యనారాయణస్వామి కల్యాణం



స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భామిని: మండలంలోని సొలికిరిలో గల భూదేవి, శ్రీదేవి సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా చేపట్టిన కల్యాణంలో అర్చకుడు చామర్తి వినయ్‌కుమార్ ఆచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటన తెలిపారు. ఇప్పటికే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: మండలంలోని గెడ్డకోల, గుజ్జి, చెక్కాపురం గ్రామాల్లో దోమల నివారణ మందు సోమవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ శాఖ సబ్ యూనిట్ అధికారి జె. మోహనరావు మాట్లాడుతూ, ప్రతి ఇంటిలోనూ ఏసీఎం 5 శాతం ద్రావణం పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్స్‌కు గౌరవ వేతనం



ఎంఈఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: సాధారణ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్స్‌గా విధులు నిర్వహించిన ఎంఈఓలు, ఇతర శాఖల అధికారులకు తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన మాదిరిగా ఒక నెల జీతం గౌరవ వేతనంగా చెల్లించాలని మండల విద్యాశాఖ అధికారుల సంఘం అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 2024లో రాష్ట్ర సాధారణ ఎన్నికల విధుల నిమిత్తం గత ఏడాది నవంబర్ నుంచి 2024 మే నెల 14వ తేదీ వరకు దాదాపు ఆరు నెలల కాలం సెక్టార్ ఆఫీసర్స్‌గా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల ప్రకారం ఎన్నికల విధులను నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల గౌరవ వేతనానికి సంబంధించి ఇటీవల మన పొరుగు రాష్ట్రం తెలంగాణలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించిన వారికి ఒక నెల జీతం గౌరవ వేతనం చెల్లించారని, మన రాష్ట్రంలో కూడా పక్క రాష్ట్రం మాదిరిగా సెక్టార్ ఆఫీసర్స్‌గా విధులు నిర్వహించిన ఎంఈఓలు, ఇతర శాఖల అధికారులకు ఒక నెల జీతం గౌరవ వేతనంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ పంపించినట్లు సామల సింహాచలం తెలిపారు.

వెంకటరాయుడుపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 72 మంది రోగులకు వైద్యసేవలు అందించామని తెలిపారు. ఈ విధానంలో గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామని, ఈ క్రమంలో ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చర్చిలో వందేళ్ల సంబరాలు

మక్కువ: స్థానిక పునీతపాతిమామాత చర్చిలో వందేళ్ల సంబరాలను క్రైస్తవ భక్తులు సోమవారం జరుపుకున్నారు. చర్చి నిర్మించి, 100ఏళ్లు పూర్తికావడంతో ఫాదర్ వి.మరియదాసు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. 100ఏళ్ల సంబరాల కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, బిషప్ రాయరాల విజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగునాయుడిని ఫాదర్లు సత్కరించారు. ఫాదర్ మరియదాస్ ఏసు సందేశాన్ని భక్తులకు వినిపించారు. తెల్లవారుజాము నుంచి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏసుభక్తులు చర్చికి చేరుకుని ప్రార్థనలు చేశారు.

ఎంత దున్నితే అంత మేలు

- వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు
- చీడపీడల ఉధృతి తగ్గడంతో పాటు భూసారం మెరుగు



గరుగుబిల్లిలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

గరుగుబిల్లి: మండే ఎండను సైతం పండేపంటకు ఉపయోగించుకోవచ్చు. ఖాళీగా వదిలిస్తే భూమి నిస్సారంగా తయారవుతుంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కనుంది. ఈ సమయంలో రైతులందరూ ఏ పంట వేస్తే బాగుంటుంది, ఎప్పుడు విత్తనాలు, ఎరువులు వేసుకోవాలి, తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికలు చేస్తుంటారు. వీటన్నింటి కంటే ముందు వేసవిలో పంట పొలాలను ఖాళీగా వదిలేయకుండా లోతుగా దుక్కిలు చేయడం వల్ల పంటలు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.

వేసవి దుక్కిలతో ప్రయోజనాలు

- రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతుగా దుక్కులు చేయడం వంటివి చేపట్టడం వల్ల ఖరీఫ్‌లో మంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.
- సాధారణంగా 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దుక్కులు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- వాలుకు అడ్డంగా దుక్కు చేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. అంతేగాక తేమ ఎక్కువ కాలం భూమిలో నిలిపి ఉంచుతుంది. పొలంలో పెరిగిపోయిన కలుపు మొక్కలు వేసవి దుక్కుల వల్ల ఎండిపోయి నశిస్తాయి. ప్రధాన పంట సమయంలో కలుపు బెడద తగ్గుతుంది.
- ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వల్ల భూమి గుల్లగా మారి వర్షపునీటిని ఎక్కువ కాలం తనలో నిలుపుకుంటుంది.
- పంటకాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండకు చనిపోతాయి. దీని వల్ల ఖరీఫ్ సాగులో చీడపీడలు, పురుగుల బెడద తగ్గుతుంది.

లోతు దుక్కులతో చీడపీడల నివారణ

లోతుగా దుక్కి చేయడం వల్ల నేల లోపలి పొరలు బయటపడి పొలం సారవంతంగా మారుతుంది. భూమి లోపల ఉండే పురుగులు బయటకు వచ్చి ఎండకు నశిస్తాయి. దీనివల్ల పంటల సాగులో చీడపీడల బెడద దాదాపు తగ్గుతుంది. లోతుగా దుక్కులు చేయడం వల్ల పంట పొలాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

– ఆర్.విజయభారతి, ఏఓ, గరుగుబిల్లి

గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిషేధం

మక్కువ: ఎన్నికల ఫలితాలు వచ్చేనెల 4వతేదీన విడుదల కానున్నందున, గ్రామాల్లో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, మైక్‌ల ద్వారా ప్రచారాలు నిర్వహించరాదని ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపారు.

ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చేనెల 6వతేదీ వరకు నిబంధనలు ఉల్లంఘించ రాదని కోరారు. గ్రామదేవతల పండగలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతులులేవని, ప్రజలు గుర్తించి, పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన బోధన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషారాణి, సిబ్బంది

కురుపాం: ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ జూనియర కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపాల్ ఎస్.ఉషారాణి అన్నారు. మండల కేంద్రం కురుపాంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు కళాశాల అధ్యాపకులతో కలిసి సోమవారం వెళ్లారు. కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, బోధన, గత కొన్నేళ్లుగా సాధిస్తున్న ఉత్తమ ఫలితాలను వివరించారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు

- జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి వినోద్



ఎన్‌జీఓ హోమ్‌లో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల మౌన ప్రదర్శన

పార్వతీపురంటౌన్: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ ఎం వినోద్ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ వద్ద అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం రాత్రి మౌన ప్రదర్శన నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన వారికి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవీ,ఎయిడ్స్ వల్ల మరణించిన వారి స్మృత్యర్థం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇస్తూ ప్రతి సంవత్సరం మే నెల 3వ ఆదివారం కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వాటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఆర్‌టీ మందులు సరిగ్గా వాడితే జీవిత కాలం పెంచుకోవచ్చని తెలిపారు. సిడి4 కౌంట్ మిషన్ జిల్లా ఆస్పత్రి పార్వతీపురంలో అందుబాటులో ఉందని, ప్రజల్లో హెచ్‌ఐవీ పట్ల అవగాహన పెరిగిందని తెలిపారు. హెచ్‌ఐవీ పట్ల జాగ్రత్త వహించాలని, తప్పక పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. హెచ్‌ఐవీ వచ్చే అన్ని మార్గాలను ఆపివేయాలని ప్రజలంతా అవగాహనతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ డా సుధీర్, జిల్లా పర్యవేక్షకుడు ఎస్ సాక్షి గోపాలరావు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విజయ పాజిటివ్ నెట్ వర్క్ సిబ్బంది, పాజిటివ్ నెట్‌వర్క్ వైడీఓ స్వచ్ఛంద సంస్థ, లింక్ వర్కర్లు (చైల్డ్ పండ ఇండియా), వైఆర్‌జీకేఆర్, ఐసీటీసీ/ఎఆర్‌టీ/డీఎస్‌ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



బర్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్

బలిజిపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట, జీలుగు, కట్టి జనుము, పిల్లిపెసర విత్తనాలను విక్రయించ నున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని వాటిని కొనుగోలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని బర్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. వాటివల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనాలు సమకూరుతాయి? వాటిని ఏ విధంగా వినియోగించాలి? వాటి ధరల వివరాలను తెలియజేశారు. మండలంలో జీలుగు 97.30క్వింటాళ్లు, కట్టి జనుము 0.9క్వింటాళ్లు, పిల్లిపెసర 0.4క్వింటాళ్లు ముందస్తుగా ఉంచినట్లు చెప్పారు.

పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో వేసుకుని 30నుంచి 45రోజులలో పూతదశకు వచ్చినప్పుడు భూమిలో వాటిని కలియదున్నాలని సూచించారు. ఇలా చేయడం వల్ల భూసారం, నేల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. నేల గుల్లబారి చౌడు విరిగి కలుపును అదుపులో ఉంచుతుందన్నారు. 5నుంచి 10శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని చెప్పారు. జీలుగు, కట్టిజనుము 10కిలోల ప్యాకెట్ రూ.880కాగా 50శాతం సబ్సిడీపై రూ.440చెల్లించాలన్నారు. పిల్లిపెసర 8కిలోల ప్యాకెట్ 50శాతం సబ్సిడీపోను రూ.536 చెల్లించాలని, విత్తనాలు ఆర్బీకేలలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వి.చాందిని, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థులకు బ్యాట్‌లు, వృద్ధులకు గొడుగులు వితరణ చేస్తున్న డాక్టర్లు జగన్‌మోహనరావు, హేమాక్షి

సీతానగరం: ప్రస్తుత ఎండలతీవ్రత దృష్ట్యా, రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానంపై వస్తున్న డాక్టర్ల నుంచి వైద్యసేవలను వినియోగించు కోవాలని జిల్లా మలేరియానివారణ అధికారి(డీఎంఓ) డాక్టర్ టి జగన్‌మోహన్ రావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తమ తండ్రి దివంగత డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ తెర్లి. గౌరినాయుడు 18వ వర్ధంతి సందర్భంగా తన సోదరి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డా. టి.హేమాక్షితో కలిసి మండలంలోని బూర్జలో నిరుపేదలకు గొడుగులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం పేదలకు దుస్తులు వృద్ధులకు గొడుగులు, విద్యార్థులకు బ్యాట్‌లు పంపిణీ చెయ్యడం ఆనవాయితీగా వస్తోందన్నారు. డాక్టర్ గౌరినాయుడు వృత్తిరీత్యా కుష్టు రోగులకు 25 సంవత్సరాల పాటు సేవలందించారని వృత్తిలో ఉండగానే స్వర్గస్తులయ్యారని తెలియజేశారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన సంక్షేమ ప్రతిభా గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం గురుకులాల డిప్యూటీ డైరెక్టర్ ఎం రుర్మాంగదయ్య ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించామని ప్రిన్సిపాల్ పి.వెంకటనాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ మల్లి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో నిర్దేశించిన విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సమక్షంలో కౌన్సెలింగ్ జరిగిందని చెప్పారు.

2024 ఏప్రిల్ 7న నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని తెలియ జేశారు. ఎంపికైన అభ్యర్థులకు జోగింపేట స్కూల్‌ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు, మల్లి (పీజీటీ) కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించినట్లు వివరించారు.

పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఆర్‌ఓ రుబెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో డీఈ కిరణ్, ఆర్‌ఓ రుబెన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో వారం రోజుల నుంచి ప్రతి వార్డులో వీధి కుళాయిల ద్వారా రంగు మారిన బురద నీరు వస్తోందని, దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. పార్వతీపురం మున్సిపాల్టీలో రంగు మారి వస్తున్న తాగునీటిని అరికట్టడంలో మున్సిపాలిటీ విఫలమైందని, ఇప్పటికైనా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రిన్సిపాల్‌ను రిలీవ్ చేయాలి

పార్వతీపురవ టౌన్: డిప్యుటేషన్‌పై సీతానగరం మండలం జోగింపేట గిరిజన సంక్షేమ శాఖ ప్రతిభ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వెంకటనాయుడిని తక్షణమే రిలీవ్ చేయాలని గిరిజన సంక్షేమ, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, వెంకటరమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకుల అధికారులు అన్ని రకాల డిప్యుటేషన్‌లు రద్దు చేశారని వెంకట నాయుడు మాత్రం ఆయన రాజకీయ పలుకుబడితో రిలీవ్ కావడం లేదన్నారు. ఆయనపై ఉన్న ఆరోపణలపై దర్యాప్తు చేయాలని నాయకులు కోరారు.

సేంద్రియ ఎరువుగా పచ్చిరొట్ట సాగు



పచ్చిరొట్టవిత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ డాక్టర్ రాబర్ట్ పాల్

సీతానగరం: ఖరీఫ్ వరిసాగు చేయాల్సిన భూముల్లో సారవంతాన్ని పెంపొందించడానికి పచ్చిరొట్ట విత్తనాలు వేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండంలోని గుచ్చిమి ఆర్బీకేలో ఏఓ ఎస్.అవినాష్‌తో కలిసి పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు రాయితీపై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట భూమిలో వేయడం వల్ల కర్బన శాతం పెరిగి నేలగుల్లబారి సారవంతంగా మారుతుందన్నారు. తద్వారా పంటలదిగుబడి పెరుగుతుందని చెప్పారు. రసాయన, నత్రజని సంబంధిత ఎరువుల వినియోగం తగ్గించవచ్చని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువు తయారీకి జీలుగు, కట్టె జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యంతో నూతన ఉత్తేజం



సినీ గీతాలకు డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

పాలకొండ రూరల్ :

ఒత్తిడిని అధిగమించే క్రమంలో నృత్యం శరీరానికి నూతన ఉత్తేజం, ఉల్లాసాన్ని అందిస్తుందని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు శాస్త్రీయ, జానపద నృత్యాలపై సోమవారం తర్ఫీదు ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులతో పాటు సంప్రదాయ కళల్లో రాణించడం ద్వారా సంఘంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అనంతరం చిత్రలేఖనంపై ఉపాధ్యాయుడు జి.మురళి శిక్షణ ఇచ్చారు.

మరకత లింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత లింగేశ్వరడు

పాలకొండ రూరల్: మరకత లింగేశ్వరని సేవలో భక్తులు పరవశించిపోయారు. స్థానిక నక్కలపేటలో కొలువైన షిర్డీసాయి మందిరంలో గల స్వామిని దర్శించేందుకు సోమవారం భక్తులు పోటెత్తారు. నందివాహనంపై నాగాభరణధారియై ప్రత్యేక అలంకరణలో మరకత లింగేశ్వరుడు స్థానికులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శరత్‌కుమార్ నేతృత్వంలో విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. 40 రోజుల నుంచి కొనసాగుతున్న చెక్‌పోస్టుల వద్ద డీఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు తనిఖీలు చేపడుతున్నాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, అన్ని గ్రామాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



పూర్ణాహుతితో ప్రదక్షిణ చేస్తున్న వేదపండితులు

సీతంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల, సహస్ర నామార్చన, నివేదన విశ్వక్షేన ఆరాధన, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం డివిజన్ పరిధిలో 132 కేవీ సబ్‌స్టేషన్ మెంటినెన్స్ కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ టి.త్రినాథరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

– జియ్యమ్మవలస: మండలంలోని అన్ని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ వి.వి.కిశోర్ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషనలో వార్షిక నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

హిందూ ధర్మం గొప్పది



హిందూ ధర్మం ఆవశ్యకతను వివరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రచార విభాగం సభ్యులు

పాలకొండ రూరల్

హిందూ ధర్మం గొప్పదని విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచార విభాగం సభ్యుడు కె.మన్మధరావు అన్నారు. పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం వద్ద గ్రామ సమితుల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొప్ప విలువలు గల హిందూ ధర్మాన్ని క్షేత్రస్థాయిలో విరాజిల్లేలా సభ్యులు కృషి చేయాలన్నారు. భగవంతుడి తత్వాన్ని ప్రజలకు అర్థమైయ్యేలా వివరించాలని సూచించారు. సమావేశంలో పరిషత్ సభ్యులు బి.రమణ, కె.జనార్థనరావు, నీలం నాయుడు, ఆబోతుల తవిటినాయుడు, జగ్గారావు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న శునకాలు



జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, సుభద్రమ్మవలస గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ గ్రామస్తులను భయపెడుతున్నాయి. 10 రోజులలో ఐదుగురిపై దాడిచేసి గాయపరచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందడంతో ప్రజలు ఒంటరిగా వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. స్థానిక యువత వాటిని తరిమేసేందుకు ప్రయత్నించినా అవి ఊరు విడిచి వెళ్లడం లేదని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని గ్రామం నుంచి తరలించాలని వారంతా కోరుతున్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే



రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: దివ్యాంగులైన చిన్నారులను గుర్తించేందుకు ఐఈఆర్‌టీ సిబ్బంది సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, రావుల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించారు. 18 ఏళ్ల లోపుగల దివ్యాంగులను గుర్తించి రిసోర్సు కేంద్రంలో చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. జూన్ 8 వరకు సర్వే చేపట్టనున్నట్లు ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు వీరాజు, విజయ లలిత తెలిపారు. ఇంతవరకు ఆరుగురు దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు తెలిపారు.